క్లుప్తంగా

నైపుణ్యాలపై దృష్టి సారించాలి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సైకాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మనస్తత్వ శాస్త్రం– వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ముగింపు సదస్సుకు ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయ అకాడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, విశిష్ట అతిథిగా హైదరాబాద్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్య డి.జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు సంకల్ప బలం, క్రమశిక్షణ, జ్ఞానం, నైపుణ్యాలు పెంచుకోవాలని, దానికి తల్లిదండ్రులు, గురువులపై భక్తిభావం కలిగి ఉండటం కీలకమన్నారు. సమాజంలో జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయించినప్పుడే పరిశోధనల్లో మెరుగుదల కనిపిస్తుందన్నారు. మానసిక వికాసానికి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.జ్యోతి, సిబిల్ రత్న, డాక్టర్ హేమ, డాక్టర్ రజిని, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పండిత సదస్సు



సదస్సు నిర్వహిస్తున్న వేదపండితులు

సింహాచలం: సింహగిరిపై గంగధార సమీపంలోని ప్రాచీన రామాలయ వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం పండిత సదస్సు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం వేద పండితులు స్వామివారి వైభవాన్ని కీర్తించారు. అర్చకులు పూజలు నిర్వహించారు. సదస్సులో వేద పండితులు రామాయణం జగన్ మోహన్‌శర్మ, ముక్కామల సుబ్రహ్మణ్యశర్మ, ఎం.లలిత్‌కుమార్‌శర్మ, మధుర సోమయాజుల శర్మ, కిరణ్ కుమార్‌శర్మ పాల్గొన్నారు.

కార్మికులను చిన్నచూపు చూస్తే పతనమే..

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1136వ రోజు సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు. కార్మికులను చిన్న చూపు చూసిన ఎన్నో రాజకీయ పార్టీలు ఇప్పటికే దీనస్థితిలో ఉన్నాయని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి భవిష్యత్తులో అదే గతి పడుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హితవు పలికారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అనిల్‌కు అభినందన



అనిల్‌ను సత్కరిస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన 60వ వార్డు ఇందిరాకాలనీ ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ శనివారం వైఎస్సార్ సీపీ విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ శాలువ కప్పి అనిల్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, పూండి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అద్భుతం



పాతగోపాలపట్నంలో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాల

- 91వ వార్డులో ప్రగతి పరుగులు
- రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

గోపాలపట్నం: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే అభివృద్ధి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో ఇదే చేసి చూపించింది. కరోనా కష్టకాలంలోనూ అభివృద్ధి కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగించింది. జీవీఎంసీ 91వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనం. ఈ వార్డులో సుమారు రూ.10 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు నిర్వహించారు. జీవీఎంసీ నిధులతో రూ.80 లక్షలతో రహదారులు, కాలువలు నిర్మించారు. లక్ష్మీనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందుకు జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలు వెచ్చించారు. పాత గోపాలపట్నంలో ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్, బాజి జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కమ్యూనిటీ హాల్‌ను ఆధునికీకరించారు. పాతగోపాలపట్నంలో నాడు–నేడు ద్వారా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేశారు. 2023–24లో రూ.2.57 కోట్ల నిధులతో 15 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో 10 పనులు పూర్తి కాగా.. 5 పనులు టెండర్ దశలో ఉన్నాయి. వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులపై స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీనగర్‌లో ఆధునికీకరించిన ఆరోగ్య కేంద్రం



పాత గోపాలపట్నంలో మెరుస్తున్న ప్రధాన రహదారి

వెచ్చించిన నిధులు.. అభివృద్ధి పనులు

- 2020–21లో రూ.53 లక్షలతో 4 అభివృద్ధి పనులు చేపట్టారు.
- 2021–22లో రూ1.50 కోట్లతో 9 పనులు చేపట్టారు.
- 2022–23లో రూ.5.29 కోట్లతో 15 పనులు పూర్తి చేశారు.
- 2023–24లో 15 పనులకు రూ.2.57 కోట్లు వెచ్చించారు.
- రూ.12 లక్షలతో బాజి జంక్షన్‌లో సీసీ రోడ్డు నిర్మించారు.
- రూ.20 లక్షలతో ప్రశాంతినగర్‌లో ప్రధాన గెడ్డ కల్వర్టు నిర్మించారు.

అభివృద్ధి చేసి చూపించారు



వార్డు స్థాయిలో అభివృద్ధి అంటే ఇలానే ఉంటుందని పాలకులు, అధికారులు చేసి చూపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా ప్రాంతం చాలా బాగా అభివృద్ధి సాధించింది.

– డి.సత్యనారాయణరెడ్డి, చిన్న బుచ్చిరాజుపాలెం

మా వార్డు బాగుపడింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మా వార్డు బాగుపడింది. ఈ నాలుగేళ్లలో అభివృద్ధిలో మంచి ప్రగతి సాధించింది. రహదారులు బాగుపడ్డాయి. చాలా సమస్యలు పరిష్కరించారు.

– చుక్క పైడిరాజురెడ్డి చిన్న బుచ్చిరాజుపాలెం

రోడ్లు, కాలువలు బాగున్నాయి



మా వార్డులో రోడ్లు, కాలువలు బాగుపడ్డాయి. మౌలిక సదుపాయాల మెరుగు కోసం ప్రభుత్వం చాలా పనులు చేపట్టింది. సచివాలయాల ద్వారా స్థానిక సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరిస్తున్నారు.

–యమ్మల సుబ్బలక్ష్మి, ఎస్సీ కాలనీ, బాజి జంక్షన్

‘ఆడారి’ని ఆశీర్వదించండి



62వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. 62వ వార్డు గాంధీజీ వీధిలోని 119, 120 పోలింగ్ బూత్‌ల పరిధిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ లక్ష్మణరావు వెళ్లి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తద్వారా రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నారన్నారు. ఆయన బాటలోనే ఆడారి ఆనంద్‌కుమార్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝూన్సీని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పైడిబాబు, బాబూరావు, శీర శ్రీను, చక్రవర్తి, ఎస్.సూర్యనారాయణ, రావాడ అప్పారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా అదే ఆదరణ

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ తుమ్మడపాలెం, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా ప్రజలతో కొంత సేపు ముచ్చటించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయనకు ప్రతి ఇంటా ప్రజలు హారతులు పట్టి విజయ తిలకం దిద్దారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గణబాబు గెలిచినా ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఒక్క చాన్స్ ఇస్తే అభివృద్ధి–సంక్షేమం కళ్ల ముందుంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణకుమారి, సీనియర్ నాయకులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆనంద్‌కుమార్

సీసీ కెమెరాలతో ఇంటికి రక్షణ

సీతమ్మధార: ఇంటికి రక్షణగా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ వెంకటరావు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని తాటిచెట్లపాలెం, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో శనివారం నివాసులకు సీసీ కెమెరాలు, దొంగతనాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు కాల్ చేసి సమాచారమివ్వాలని కోరారు. ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు ఉంచారదని, బ్యాంక్‌లో భద్రపరచడమే మేలని సూచించారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు ఇంటికి జాగ్రత్తగా తాళాలు వేసుకుని, ఇరుగుపొరుగు వారితోపాటు పోలీసులకు తెలియపర్చాలన్నారు. వాకింగ్ చేసే మహిళలు మెడలో బంగారు నగలు కనిపించకుండా జాగ్రత్త పరుచుకోవాలన్నారు. బ్యాంకు అధికారులు మంటూ ఏటీఎం పిన్ ఎవరైనా అడిగితే చెకూడదని సూచించారు. సైబర్ క్రైం కేసులపై ప్రజలకు వివరించారు. చోరీ కేసుల్లో పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాసనగర్ వాసులకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటరావు

కృత్రిమ మేధస్సుతో పెరిగిన ఉద్యోగావకాశాలు

ఉక్కునగరం: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)తో సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరిగాయని ట్రూపర్ కూట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సామిక్ చంద్ర అన్నారు. ‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్’ పై స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధస్సు వల్ల వ్యాపార అవకాశాలు పెరిగాయన్నారు. చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఈశ్వర చంద్ర విద్యాసాగర్ హరీష్ మాట్లాడుతూ వర్క్‌ప్లేస్ సిమ్యులేషన్ గురించి తెలుసుకోవడం వల్ల కలిగే అవకాశాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.తౌడన్న, ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ చేతన్ గౌడ, నిర్వాహకులు విజయ్ మంజేటి, ఆకాంక్ష, రవికుమార్ పాల్గొన్నారు.



ప్రెజెంటేషన్ ఇస్తున్న ట్రూపర్ కూట్ ప్రతినిధులు

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ కూడలిలోని సీపీఐ కార్యాలయంలో శనివారం సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుడాల రాంబాబు చేతుల మీదుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవ ఆదర్శంతో అతి చిన్న వయసులోనే ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్, శివరాంరాజ్, సుఖదేవ్ జాఫర్‌లు భారతీయులందరికీ ఆదర్శమన్నారు. భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలందరూ తిప్పికొట్టాలని, అదే విప్లవవీరులకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.వి.త్రినాథ్, జి.రామకృష్ణ, వై.కామేశ్వరరావు, డి.గోపి, ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణలో పాల్గొన్న కామర్స్ అధ్యాపకులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు జిల్లాలకు చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కామర్స్ అధ్యాపకులు ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. కళాశాలలో ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకూ కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్, ఐఐటీ ఢిల్లీ బృందం సభ్యులు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. నూతన అంశాలపై అధ్యాపకులు పట్టు సాధించడానికి ఈ శిక్షణ దోహదపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల నుంచి 50 మంది అధ్యాపకులు, రిసోర్స్ పర్సన్‌లు, కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

గాజువాక: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని, అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని 13వ జిల్లా అదనపు న్యాయమూర్తి జి.షణ్ముఖరావు అన్నారు. బాధితులకు చట్టం ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. మహిళా చట్టాలపై మండల లీగల్ సర్వీస్ కమిటీ, స్వాతి మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపులు, గృహహింస, భరణం, కట్నం వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ నాయకులు బి.వి.ఎం.కృష్ణ, ఫరా, రాజ్యలక్ష్మి, రాణి, బేబీరాణి, ఆర్.సూర్యనారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

ఆనంద్‌కుమార్ వెంటే మేమంతా..



ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ పి.వి.సురేష్‌లతో 60వ వార్డు యువత

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు తోడు ఆనంద్‌కుమార్ ఆపదలో ఉన్న వారికి అండగా ఉండడంతో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. దీనిలో భాగంగా శనివారం నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువత ఆనంద్‌కుమార్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యే కరోనా వంటి సమయంలో ఇంట్లో దాక్కున్నారని యువకులు ఆరోపించారు. అలాంటి నాయకుడికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలనే లక్ష్యంతో ఆనంద్‌కుమార్‌తో తామంతా నడుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ (నేవీ అనిల్),పూండి మల్లేశ్వరరావు, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్,ఆడారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన కుల సంఘాల నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పాత గోపాలపట్నం ప్రాంతానికి చెందిన పలు సంఘాల నాయకులు వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, శ్రీ సీతారామ, అభయాంజనేయ గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీఎస్ రాజు ఆధ్వర్యంలో పలు కుల సంఘాల నాయకులు శనివారం ఆనంద్ కుమార్‌ను మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో కలిశారు. పశ్చిమ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కుల సంఘాల నాయకులు మద్దతు తెలపడం ఆనందంగా ఉందన్నారు. తనను గెలిపిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేతల్లో చూపిస్తానన్నారు. శ్రీ జువ్వాలమ్మ కాపు, తెలగ, బలిజ సంఘం, శ్రీ కృష్ణ యాదవ్ సంఘం, శెట్టి బలిజ సంఘం, ఎస్సీ నవోదయ యువజన సంఘం, భవాని జరుకుల సంఘం, కళింగ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, పశ్చిమ ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణ కుమారి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ కమిటీ సభ్యులు, పలు సంఘాల నాయకులు బల్లంకి వెంకటరావు, ముమ్మన సత్యనారాయణ, కరణ కనక రాజు, గొలగాని అప్పలరాజు, కొప్పాక సన్యాసిరావు, ఎక్కల దేవి కుమారి, బొడ్డే పల్లి తోటరావు, టి. చంటి తదితరులు పాల్గొన్నారు.



ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతు తెలుపుతున్న వివిధ కుల సంఘాల నాయకులు

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు పరిధిలో టీడీపీ, జనసేకు చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు, మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మర్రిపాలెం వుడాలేఅవుట్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తెచ్చేందుకు మహిళలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మీరే స్టార్ క్యాంపైనర్లుగా పని చేయాలన్నారు. జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, నాగన్నచలం(చిన్న) ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పశ్చిమ ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణ కుమారి, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 89వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన మహిళలతో ఆడారి ఆనంద్‌కుమార్, పిల్లా రమాకుమారి, పేడాడ రమణకుమారి

సమగ్రంగా దూరవిద్య కోర్సుల రూపకల్పన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రంలో అందించే కోర్సుల రూపకల్పన నుంచి నిర్వహణ వరకు ప్రతి దశలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దూర విద్యలో సంస్కరణలు అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సరైన దిశలో చేసే సంస్కరణలు భవిష్యత్తులో మంచి ఫలితాలు అందిస్తాయన్నారు. విద్యా రంగంలో పని చేస్తున్న వారంతా సేవా దృక్పథంతో నడుచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో స్వల్పకాలిక కోర్సుల ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. దూరవిద్యలో చదివే విద్యార్థులకు సైతం రానున్న కాలంలో ప్లేస్‌మెంట్స్ కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు. కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పరీక్షల్లో ఓఎంఆర్ జవాబు పత్రాలను ప్రవేశ పెడుతున్నామన్నారు. రానున్న కాలంలో ఆన్‌లైన్ కోర్సులకు గణనీయంగా డిమాండ్ ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం తమ కేంద్రంలో అందించే అన్ని సేవలకు ఆన్‌లైన్లో చెల్లింపులు జరిపే సదుపాయం కల్పించామన్నారు. ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ ఎస్‌డీఈని అభివృద్ధి చేసిన విధానం చాలా బాగుందన్నారు. లక్ష మంది విద్యార్థులకు సేవలు అందించడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ జయరామ్ రచించిన బీఈడీ పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు. ఈ సదస్సులో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఎస్‌డీఈ అసోసియేట్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, ఏయూ దూరవిద్య స్టడీ సెంటర్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

కార్పొరేట్ రంగంలో పెరుగుతున్న పోటీతత్వం

ఏయూ క్యాంపస్: మార్కెటింగ్ విధానాలు, వ్యూహాలు మారుతున్న నేపథ్యంలో కార్పొరేట్ రంగంలో పోటీతత్వం పెరుగుతోందని కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆచార్య కిషోర్‌బాబు అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో శనివారం జరిగిన మార్కెటింగ్ డైమెన్షన్స్–ఇండస్ట్రీ 4.0 అంశంపై ఆయన మాట్లాడారు. పోటీ ప్రపంచంలో లక్ష్య సాధనకు మార్కెటింగ్ సాధనంగా నిలుస్తుందన్నారు. కంటెంట్ డిజైన్, లాంగ్వేజ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, బిహేవియర్ స్టడీస్, సామాజిక సంబంధాలు, సామాజిక అవసరాలకు అనుగుణంగా ప్రకటనల రూపకల్పన చేయాలని సూచించారు. డిజిటల్, బ్రాండ్ మార్కెటింగ్‌లు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆచార్య కిషోర్‌బాబును విభాగం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డ్టార్ బి.సుబ్బయ్య, కె.వి.రమణ మూర్తి, విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆచార్య కిషోర్‌బాబు